క్లుప్తంగా

కుష్టు వ్యాధి రహిత సమాజమే లక్ష్యం



రికార్డులను పరిశీలిస్తున్న డీడీ శ్రీనివాసరెడ్డి

శిరివెళ్ల: కుష్టు వ్యాధి రహిత సమాజమే లక్ష్యంగా పని చేస్తున్నామని లెప్రసీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వ్యాధి నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరాతీశారు. మండలంలో 29 అనుమానిత కేసులను గుర్తించామని డాక్టర్ విజయకుమార్ డీడీకి తెలిపారు. వ్యాధి వ్యాప్తి, నివారణకు తీసుకోవలిసిన జాగ్రత్తలు, చికిత్సలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ నెల 16 వరకు కార్యక్రమం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పారామెడికల్ ఆఫీసర్ విజయకుమార్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర రెడ్డి, సీహెచ్‌ఓ రాంమోహన్‌రెడ్డి, సూపర్ వైజర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మహిళల పోరు యాత్రను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): మహిళలపై జరుగుతున్న హింసపై చేపడుతున్న మహిళల పోరు యాత్రను జయప్రదం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కోశాధికారి సావిత్రమ్మ, జిల్లా అధ్యక్షురాలు నిర్మల పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని నూనెపల్లె మహిళా సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9వ తేదీన విజయవాడలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. మహిళల పోరుయాత్ర సభ అన్ని జిల్లాల్లో నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో మహిళా నాయకురాలు రమణమ్మ, శివమ్మ, మరియమ్మ, వెంకటలక్ష్మమ్మ, తిరుపాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలి



చిన్నారితో అక్షరాలు దిద్దిస్తున్న ఎంపీపీ

దొర్నిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన క్రిష్టిపాడులోని అంగన్‌వాడీ కేంద్రం -1ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న పోషణ, పోషన్ ప్లస్ ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. వంటల విషయంలో చాలా శుభ్రత పాటించి కలుషితం కాకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరానికి స్పందన

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు సచివాలయంలో మంగళవారం నిర్వహించిన ఆధార్ నమోదు క్యాంపునకు విశేష స్పందన లభించింది. ఎక్కువ శాతం అడ్రస్‌లో జిల్లా పేరును మార్చుకుంటున్నారు. ప్రభుత్వ పథకాల అమలుకు ఆధార్ కార్డు కీలకం కావడంతో ఎంపీడీఓ సుబ్బారెడ్డి ప్రజల ఇబ్బందుల దృష్ట్యా గ్రామంలో క్యాంపును ఏర్పాటు చేయించారు. బుధవారం ఆధార్ నమోదు కొనసాగుతుందని ఆయన తెలిపారు.

దోమల నివారణతో ఆరోగ్యం

రుద్రవరం: దోమల నివారణతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని రుద్రవరం పీహెచ్‌సీ వైద్యులు ప్రసాద్ అన్నారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల ముందు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రధానంగా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

న్యాయవాదుల నిరసన

నంద్యాల(వ్యవసాయం): కోర్టు ఆవరణంలో ఐఏఎల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఐఏఎల్ జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ 35ఏళ్లు నిండిన న్యాయవాదులకు వెల్ఫేర్ ఫండ్ అవకాశం కల్పించాలని, వెల్ఫేర్ ఫండ్ రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాలని, జూనియర్ న్యాయవాదులకు మరణించిన న్యాయవాదులకు రూ.10లక్షలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఏఎల్ సభ్యులు సుబ్బరాయుడు, హరి, తిరుపాలు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలు విస్తరించాలి

గోస్పాడు: ఆరోగ్యోసేవలు విస్తరించాలని రాష్ట్ర లెప్రసీ డిప్యూటీ డైరెక్టర్, నంద్యాల జిల్లా నోడల్ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని గోస్పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతరావు నాయక్, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రీమంత్‌లతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అందజేస్తున్న వైద్య సేవలు ప్రజలకు సకాలంలో అందేలా చూడాలన్నారు.

ఫోన్ నెంబరు ఆధార్‌కు లింకు అయ్యింది



నాపేరు పేరు పాశం చిన్న ఓబయ్య. మాది గోస్పాడు మండలం తేళ్లపురి గ్రామం. గతంలో ఆధార్ కార్డుకు ఫోన్ నెంబరు లింక్ కాకపోవడంతో ఎంతో ఇబ్బంది పడ్డాను. బ్యాంకుల వద్దకు వెళ్లి సమయాల్లో, ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరే సమయంలో సెల్‌కు ఓటీపీ రాక అవస్థలు ఎదుర్కొన్నా. దీని కోసం ఎన్నో మార్లు మండల కేంద్రానికి తిరిగినా పని కాలేదు. అధికారులు గ్రామానికి వస్తున్న విషయం తెలియడంతో వారికి సమస్యను తెలుపగా అక్కడికక్కడే సమస్యను పరిష్కరించారు.

రూపాయి ఖర్చు లేకుండా అడంగల్, వన్‌బీ ఇచ్చారు



నా పేరు దొరకొండ జోజప్ప, మా ఊరు పసురపాడు గ్రామం. అవసరమైన సమయాల్లో అడంగల్, వన్‌బీల కోసం నెట్ సెంటర్లు, మీసేవ కేంద్రాలున్నా ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం గ్రామంలోనే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి మా లాంటి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అక్కడికక్కడే అందజేస్తుండటం ఎంతో ఆనందంగా ఉంది. నాకు అవసరమైన అడంగల్, వన్‌బీ కోసం దరఖాస్తు చేసుకోగా వెంటనే ధ్రువీకరణ పత్రాన్ని ఒక్కరూపాయి ఖర్చు లేకుండా మంజూరు చేశారు. సమయం వృథా కాకుండా, డబ్బు ఖర్చు కాకుండా పని జరిగింది. గతంలో ఎప్పుడు ఇలాంటి పనులు ఎవరు చేయలేదు.

మెరుగైన సేవలందించేందుకే 'జగనన్న సురక్ష'

- నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- అట్టహాసంగా జగనన్న సురక్ష కార్యక్రమం
- లబ్ధిదారులకు సర్టిఫికెట్ల పంపిణీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి

గోస్పాడు: ప్రజా సమస్యలకు మెరుగైన సేవలు అందించేందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పసురపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాల పథకం ద్వారా లబ్ధి చేకూర్చిందన్నారు. అంతేగాకుండా మరింత మెరుగైన సేవలను ప్రజల వద్దకే తీసుకొని వచ్చేందుకే ప్రస్తుతం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గ్రామ గ్రామానా నిర్వహిస్తోందని చెప్పారు. దీని ద్వారా ప్రజలకు ఒకే ఒక్క రోజులో అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను అప్పటికప్పుడే అందించే వెసులుబాటు కల్పించారన్నారు. గ్రామాల్లోకి అధికారులు వచ్చి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేస్తున్నారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే ఇంత కన్న ఎక్కువగా సంక్షేమ పథకాలను అమలు చేస్తారని కల్లబొల్లి మాటలను చెబుతారని, అలాంటి వారిని నమ్మవద్దన్నారు. పసురపాడులో జరిగిన జగనన్న సురక్ష ద్వారా 492 దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటన్నీ ఎంపీడీఓ భాస్కర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్, డీటీ రామచంద్రారావు, ఇతర మండల అధికారులు పరిశీలించి అక్కడికక్కడే 492 ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో బెస్త సంఘం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గిరిబోయిన చంద్రశేఖర్, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, సర్పంచ్ లలితమ్మ, ఎంపీటీసీ భక్తవత్సలరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ గోకుల కృష్ణారెడ్డి

జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(రూరల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథక కార్యక్రమాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల మండలం జెడ్పీటీసీ గోపవరం గోకుల కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని భీమవరం గ్రామంలో ఎంపీడీవో సుగుణశ్రీ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను వారు పంపిం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భక్తవస్తులమ్మ, ఎంపీటీసీ రఘురాం రెడ్డి, ఉపసర్పంచ్ బలరామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పథకాలతో ప్రజలకు ఆర్థిక భరోసా



సంక్షేమ పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, సుభిక్ష పాలన అందిస్తున్నారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం, సాయంత్రం మండల పరిధిలోని అయ్యలూరు గ్రామంలో మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి, గ్రామ సర్పంచ్ ఓబులేసు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పుష్పలత, ఎంపీటీసీ రసీదు, సర్పంచ్ ఓబులేసు, వైస్ సర్పంచ్ శివలలిత తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ఓ బృహత్తర కార్యక్రమం



మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: రాష్ట్ర ముఖ్యమంత్రి చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం బృహత్తరమైనదని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన చాగలమర్రిలోని 3 వ సచివాలయ పరిధిలోని 10, 11వ వార్డులలో ఏపీ స్టేట్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, కన్వీనర్ జి.కుమార్‌రెడ్డిలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన అల్లూరి సీతారామరాజు, వంగవీటి మోహనరంగ జయంతిలను పురస్కరించుకొని వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రతి ఇంటికి వెళ్లి వారు పొందిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. 2022వ సంవత్సరానికి సంబంధించి వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా కింద ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 4,114 మంది రైతులకు రూ.8,03,92602 నష్ట పరిహారం మంజూరైందన్నారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ అధ్యక్షులు గణేష్ రెడ్డి, మండలాధ్యక్షుడు వీరభద్రుడు, ఉపాధ్యక్షుడు ముల్లా. రఫీ, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, కో-ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- గుండంపాడులో జగనన్న సురక్ష కార్యక్రమం



గుండంపాడులో లబ్ధిదారురాలికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: తమ ప్రభుత్వంలో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తుందని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రా రెడ్డి అన్నారు. మంగళవారం గుండంపాడులో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 133 మందికి ఆదాయ సర్టిఫికెట్లు, 174 మందికి కులధ్రువీకరణ పత్రాలు, ఒకరికి ఆర్థికంగా వెనుక బడిన సర్టిఫికెట్, 15 మందికౌలు రైతు గుర్తింపు కార్డులు, 10 మందికి చెందిన ఆధార్ కార్డుకు పోన్ నెంబర్ సీడింగ్ చేసిన పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హత ఉండీ గతంలో ప్రభుత్వ పథకాలు పొందనేని వారి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. వలంటీర్లు ఇంటింటికి తిరిగి ఎవరికి ఏ సర్టిఫికెట్ అవసరమో గుర్తించి వారికి ధ్రువీకరణ పత్రాలను అందచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం దేశంలో ఏ రాష్ట్రంలో జరగలేదన్నారు. ఎన్నికలు 9 నెలలు ఉండడంతో టీడీపీ నాయకులు అవి చేస్తాము, ఇవి చేస్తామని అలవికాని హామీలు గుప్పిస్తున్నారన్నారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. గ్రామ నాయకుడు రేవనూరు ఆంజనేయ రెడ్డి విన్నపం మేరకు ఎస్సీ కాలనీలో తాగునీరు, ఇళ్ల స్థలాల కేటాయింపులు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సిమెంట్ రోడ్లు వేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు మౌనిక, పెద్ది రమణ, జింకల నాగన్న , శివారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, వక్ఫ బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ. అబ్దుల్ సలాం, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నరహరి పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రిలోని 3వ సచివాలయ కార్యాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాన్ని ఎంపీడీఓ మహబుబ్‌దౌలా అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ వీరభద్రుడు హాజరయ్యారు. 3వ సచివాలయ పరిధిలో 221 ధ్రువీకరణ పత్రాలు అక్కడికక్కడే మంజూరు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తొలసమ్మ, ఉప మండలాధ్యక్షుడు ఎం.రఫి, తహసీల్దారు సుభద్రమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక జగనన్న సురక్ష

ఉయ్యాలవాడ : ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రాధాన్యతగా తీసుకుందని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని అల్లూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 105 మందికి కుల, ఆదాయ, ఆధార్, ప్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ గ్రామ సర్పంచ్ ఆరికట్ల శివరామక్రిష్టారెడ్డి, మాజీ గ్రామ ఉప సర్పంచ్ కూలూరు రామక్రిష్టారెడ్డి, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం

ఆళ్లగడ్డ : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డీఎల్‌డీఓ జనార్దన్ అన్నారు. రూరల్ మండలం పేరాయిపల్లె గ్రామ సచివాలయ పరిధిలో ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ అధ్యక్షతన మంగళవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం చేపట్టారు. సచివాలయ పరిధిలో 211 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ తహేర్‌హుస్సేన్, సర్పంచ్‌లు అంబటి నాగలక్ష్మమ్మ, పల్లె రామలక్ష్మమ్మ ఉన్నారు.

ప్రజల సంక్షేమానికి రక్షణగా సురక్ష

దొర్నిపాడు: జగనన్న సురక్ష పథకం ప్రజల సంక్షేమానికి రక్షణగా నిలుస్తుందని ఎంపీపీ గోపవరం అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సచివాలయ పరిధిలోని 252 మందికి ధ్రువపత్రాలను అందజేశారు.

సద్వినియోగం చేసుకోండి

రుద్రవరం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని ఆలమూరులో మంగళవారం తహసీల్దారు రవీంద్ర ప్రసాదు, ఎంపీడీఓ మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. సర్పంచు పాణ్యం లక్ష్మీ దేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 190 మందికి వివిధ ధ్రుపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ వరలక్ష్మి, ఏఈలు వెంకటరాముడు, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద పొలాల దారి పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరు-చిత్రేనిపల్లె గ్రామాల మధ్య పొలాల దారి వివాదాస్పదంగా మారింది. దారి సమస్య పరిష్కరించాలని అటు వైపు పొలాలు ఉన్న రైతులు మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో తహసీల్దారు రవీంద్ర ప్రసాదును కోరారు. స్పందించిన ఆయన వెంటనే రైతులు, వీఆర్వోలు, సీపీఎం నాయకులు, గ్రామ పెద్దలతో కలిసి వెళ్లి వివాదస్పద దారిని పరిశీలించారు. ప్రధాన రహదారి నుంచి పొలాల లోపలికి వెళ్లేందుకు కొందరు రైతు లు కలిసి దారి పనులు చేపట్టారు.కొద్ది దూరం వేశాక ఓ రైతు అడ్డుకోవడంతో దారి పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. రైతులతో మాట్లాడారు. ఒకరికొకరు కలిసి మెలిసి ఉంటేనే అందరికి సౌకర్యం వంతంగా ఉంటుందని నచ్చజెప్పారు. మనస్పర్థలు వీడి అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు.

ఘనంగా అల్లూరి జయంతి



అల్లూరి చిత్రపటానికి పూల మాల వేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరు చిత్రపటానికి ఎస్పీ రఘువీర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు భారత దేశంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసిన వీరుడని, ఆయన ధైర్యసాహసాలు, దేశభక్తి నేటికీ ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని, జాతీయ భావాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాలన్నారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ అడ్మిన్ వెంకటరాముడు, ఏఆర్ అడిషినల్ ఎస్పీ చంద్రబాబు, డీఎస్పీ రంగముని, ఆర్ఐ సుధాకర్ ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల(సెంట్రల్): స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ అసమానమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం(ఆర్ఏఆర్ఎస్) సహ సంచాలకులు ఎన్‌సీ వెంకటేశ్వర్లు కొనియాడారు. మంగళవారం పరిశోధనా స్థానం ప్రాంగణంలో అల్లూరి 125వ జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, బోధనేతర సిబ్బంది సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు.

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ సిబ్బంది అంబటి భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, హరి హరనాథ్‌రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం మన్యంవీరుడు, విప్లవం జ్యోతి అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, ఏఐటీయూసీ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మోటరాముడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : మన్యం వీరుడు అల్లూరి సీతరామరాజు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని ప్రైవేటు పాఠశాలల డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా అన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతరామరాజు జయంతి వేడుకల్లో భాగంగా మంగళవారం స్థానిక కేపీజీ పాఠశాలలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘణ నివాళులర్పించారు.

చాగలమర్రిలో చోరీ

చాగలమర్రి: స్థానిక ముత్యాలపాడు బస్టాండు సమీపంలోని చింతలచెరువు రస్తాలో నివాసం ఉంటున్న ఖలీఫ్ ఖాజారసూల్ ఇంట్లో దొంగలు పడి రూ.లక్ష విలువ చేసే బంగారు చైను, ఉంగరం దోచుకెళ్లారు. వివరాల్లోకి వెళితే ఆదివారం ఉదయం ఖలీఫ్ ఖాజారసూల్ తన భార్యతో కలిసి ఎల్లార్తి దర్గాకు దైవ దర్శనం కోసం వెళ్లారు. వారు మంగళవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బిరువాలను, కబోర్డులను పగులగొట్టి అందులో వున్న గుడ్డలు, ఇతర వస్తువలను చెల్లచేదురుగా పడేసి ఉన్నాయి. బీరువాలోని ఉంగరం, ఒక చైను, రూ.10 వేల నగదు చోరికి గురైనట్లు గుర్తించారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



నెహ్రూనగర్ సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జేకేసీ స్పెషల్ ఆఫీసర్ కోన శశిధర్

గోస్పాడు: సచివాలయాల సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఐటీ సెక్రటరీ, జేకేసీ స్పెషల్ ఆఫీసర్ కోన శశిధర్, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. మండలంలోని నెహ్రూనగర్ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయానికి వచ్చే సర్వీసులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని సిబ్బందికి సూచించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ అవసరమైన ఎరువులు, విత్తనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

బావిలో దూకి రైతు ఆత్మహత్య

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామానికి చెందిన దస్తగిరి (43) అనే రైతు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ మౌలాలి మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు దస్తగిరి గత మూడేళ్లగా పత్తి, మిరప పంటలను సాగు చేస్తున్నాడు. పంటలు కలిసి రాకపోవడతో రూ.30లక్షల వరకు అప్పులు చేశాడు. దీంతో మనస్తాపానికి గురై బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భార్య లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

ఎమ్మార్పీకే విక్రయించాలి

ఉయ్యాలవాడ : రైతులకు అవసరమయ్యే క్రిమి సంహారక మందులు, రసాయనిక ఎరువులు ఎమ్మార్పీకే దుకాణదారులు విక్రయించాలని వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన ఎరువుల వ్యాపారులు ప్రభుత్వం నమోదు చేసిన ధరలకే ఎరువులు, క్రిమి సంహారక మందులు విత్తనాలు రైతులకు అందజేసి రోేదులు ఇవ్వాలన్నారు.

వైభవంగా అష్టాదళ పాద పద్మారాధన సేవ





అష్టాదళ పాద పద్మారాధనలో అమ్మవారు,అమ్మవారికి సారెను సమర్పిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో ఆషాడమాసం మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం సమర్పించారు కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు పాల్గొన్నారు.

వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో సారె..

ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో కాళికాంబ దేవికి మంగళవారం పుట్టింటి పట్టుచీర, సారెను సమర్పించారు. కార్యక్రమంలో వాసవీ మహిళా మండలి సభ్యులు ఇందుమతి, శోభారాణి పాల్గొన్నారు.

జగజ్జననీ మాతకు సారె సమర్పణ

పట్టణంలో వెలసిన జగజ్జననీ మాతకు ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం భక్తులు భక్తిశ్రద్ధలతో సారెను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

అన్నపూర్ణేశ్వరిదేవికి కలశాభిషేకం

పట్టణంలోని కోటావీధిలో వెలసిన శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలోని అన్నపూర్ణేశ్వరికి ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని కలశాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు.

50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన బిల్లలాపురం గ్రామస్తులతో ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి పార్టీలోకి చేరికలు జరుగుతున్నాయని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు మంగళవారం ఎమ్మెల్యే శిల్పా రవి సమక్షంలో ఆయన నివాస గృహంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామానికి చెందిన వేముల రాముడు, కిట్టయ్య, స్వామి, తిరుపతి, ఇంద్రా, రామకృష్ణ, రమణ, హరి, శ్రీనివాసులు, రామచంద్రులు తదితర కుటుంబాలకు చెందిన వారిని ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ సిద్ధం శివరాం, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కేసు నమోదు

చాగలమర్రి: మండలంలోని చిన్నవంగలి గ్రామానికి చెందిన ఇరు వర్గాలపై చాగలమర్రి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన వెదురు లక్ష్మీనరసింహారెడ్డి అతని భార్య వెదురు అరుణమ్మల ఇంటికి (బట్టలు ఉతికే)మేరా డబ్బులు అడగటానికి అదే గ్రామానికి చెందిన రజక వెంకటేశ్వర్లు అతని భార్య రామసుబ్బమ్మ వెళ్లారు. అయితే వెదురు లక్ష్మీనరసింహారెడ్డి అతని భార్య దుర్భాషలాడి, కులం పేరుతో దూషించి, తమపై దాడి చేశారని, అంతే కాకుండా మేర డబ్బులు పెంచిన గ్రామ పెద్దమనుషులను కూడా దూషించారని రజక వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, పాత మనస్పర్థలు మనసులో పెట్టుకొని తమపై అదే గ్రామానికి చెందిన రామగుర్విరెడ్డి, అతని కుమారులు రాంప్రతాప్‌రెడ్డి, ఉపేంద్రారెడ్డిలు దాడిచేసి గాయపరిచారని వెదురు లక్ష్మీనరసింహ్మారెడ్డి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిపై కూడా కేసు నమోదు చెసినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.